# రోడ్డుమీది రాయి

**అర్థరాత్రి! నేషనల్ హైవే.**

**ఒక లారీ 60 కి.మీ. స్పీడ్‌తో వస్తోంది. డ్రైవర్ రసూల్ ఏకాగ్రతతో నడుపుతున్నాడు. రసూల్ మనసంతా ఒక విషయంపై ఆగిపోయింది. ఇంకో గంటలోగా గమ్యం చేరుకోవాలి.**

అంతలో సడెన్‌గా.."తుస్" మన్న శబ్దంతో లారీ నాలుగు వంకర్లు తిరిగి అతి ప్రయత్నం మీద ఓ చెట్టును చిన్నగా 'ఢీ' కొట్టింది.

అనుకోని పరిణామానికి క్లీనర్ ఇంతెత్తున ఎగిరిపడ్డాడు. రసూల్ తలకి చిన్న గాయమయ్యింది. క్లీనర్ దిగి "చిన్న రిపేరే" అన్నాడు రసూల్‌తో.

దగ్గర్లోని రాళ్ళని తెచ్చి లారీ చుట్టూ పెట్టి అరగంటలో రిపేర్ పూర్తి చేశారు.

"ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. వెళ్దాం పద" అంటూ తొందరపెట్టాడు రసూల్.

"అయిపోయింది సార్! ఇంకొక్క నాలుగు రాళ్ళే ఉన్నాయి అవి కూడా తీసేస్తే" అంటున్న క్లీనర్ మాటలు పూర్తి కాకుండానే.

"ఆ నాలుగు రాళ్ళు తీయకపోతే కొంపలేం మునగవులే. త్వరగా వచ్చేయ్!" అంటూ లారీ స్టార్ట్ చేశాడు.

ఇక చేసేదేమీ లేక మిగిలిన రాళ్ళని అలాగే వదిలేసి వచ్చాడు క్లీనర్.

★ ★ ★

ఇంట్లో అడుగుపెట్టిన రసూల్‌కి వాతావరణమంతా గంభీరంగా కన్పించింది. రోజూ నవ్వుతూ ఎదురొచ్చే భార్య కనబడలేదు. అల్లంత దూరం నుండే "నాన్నా" అంటూ కాళ్ళను చుట్టేసే కూతురి అలికిడీ లేదు.

ఒక్కసారిగా గుండెలో గాబరా మొదలైంది.

"ఏమైంది? అందరూ ఎందుకిలా ఉన్నారు?" అడిగాడు దిగులుగా కూర్చున్న భార్యను!

"మనబ్బాయి.." చెప్పలేకపోయింది.

"ఏమైంది వాడికి. నిన్న వాళ్ళ ఫ్రెండ్ ఫంక్షన్‌కి వెళ్తానన్నాడుగా? పైగా రాత్రే వస్తానని కూడా చెప్పాడు" అన్నాడు ఆత్రంగా.

"అక్కడ ఫంక్షన్ అయిపోయేసరికి బాగా పొద్దుపోయిందట! త్వరగా ఇల్లు చేరుకోవాలనే తొందరలో ఇలా జరిగింది" చెప్పింది వెక్కిళ్ళ మధ్యన.

"ఇంతకీ వాడెక్కడ?"

భార్య చూపించిన దిశగా చూసి అవాక్కయ్యాడు రసూల్.

అక్కడ మంచంపై కన్నీళ్ళతో కొడుకు ఒక కాలుకి పూర్తిగా బ్యాండేజీ వేసారు.

"ఎలా జరిగిందిరా?" అంటూ కన్నీళ్ళ పర్యంతమయ్యాడు.

"రాత్రి వస్తుంటే..ఎదురుగా వచ్చిన టాటా సుమోను తప్పించడానికి బండిని కాస్త పక్కకి తిప్పాల్సి వచ్చింది! అప్పుడు బండి కాస్త ఓ రాయి మీదికెక్కి రెండు పల్టీలు కొట్టింది" చెప్పాడు ఏడుస్తూ.

"రోడ్డు మీదికి రాళ్ళెలా వచ్చాయిరా?" అడిగాడు దుఃఖం కాస్త తగ్గాక!

"ఎవరో తమ బండి దార్లో ఆగిపోతే బాగు చేసుకొని ఆ రాళ్ళను అక్కడే వదిలేసుంటారు" చెప్పాడు.

రాళ్ళు వదిలేసి వెళ్ళిన వాళ్ళను తిట్టిపోస్తోంది భార్య.

దూరంగా..ఎక్కడ్నుండో మరో మాతృమూర్తి తనకు కడుపుకోత పెట్టిన వాడ్ని శాపనార్థాలు పెడుతున్నట్టుగా రసూల్‌కి అనిపిస్తోంది.



వినలేనట్లుగా చెవులు మూసుకున్నాడు వెంటనే.."ఒరేయ్ జానీ పదరా" అన్నాడు తొందరపెడ్తూ.

"ఎందుకు?" అంటున్న క్లీనర్‌తో..

"ఆ రాళ్ళు తీసెయ్యడానికి" అంటూ వడివడిగా వెళ్ళిపోయాడు రసూల్!

**-ఎ.విజయవాణి** (కామారెడ్డి)

